క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు



ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ రాఘవేంద్రానగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాఘవేంద్రా కాలనీ, బ్యాంక్ కాలనీ, ప్రశాంత్‌నగర్, బీరప్ప గడ్డ, సాయిరాంనగర్, ఈస్ట్ కళ్యాణపురి, శ్రీగిరి కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. బ్యాంక్ కాలనీ 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంత్‌నగర్, బ్యాంక్ కాలనీ, బీరప్పగడ్డ, లిటిల్ ఫ్లవర్ స్కూల్ బ్యాక్‌సైడ్, ఎస్‌బీహెచ్ కాలనీ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని అధికారులు తెలిపారు.

ఎన్నికల కోసమే పాదయాత్ర

కుషాయిగూడ: ఎన్నికలు సమీపిస్తుండటంతో కేవలం ఎన్నికల కోసం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్నారని బీజేపీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు నాదం ఆరోపించారు. ఎమ్మెల్యే పాదయాత్ర సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యేకు పాదయాత్ర చేసే అర్హత లేదన్నారు. మరోమారు ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకోవడం కోసమే పాదయాత్ర చేస్తున్నారన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు లక్ష్మణ్‌గౌడ్, వెంకులు, సోమసాని అశోక్, వెంకటేష్, కందాడి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ సర్కిల్ డీసీ అరుణకుమారి బదిలీ

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ డీసీ అరుణకుమారిని సరూర్‌నగర్ సర్కిల్‌కు బదిలీ చేస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కార్వాన్ సర్కిల్ డీసీ బి.శ్రీనివాస్ ఉప్పల్ సర్కిల్‌కు రానున్నారు. ఈ మేరకు మంగళవారం గ్రేటర్ పరిధిలోని వివిధ సర్కిళ్లకు సంబంధించిన డీసీలను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

కాప్రా సర్కిల్ డీసీ శంకర్ బదిలీ

కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్.శంకర్ బదిలీ అయ్యారు. ఆయన దాదాపు రెండున్నరేళ్లు సర్కిల్‌లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం బదిలీపై ఎల్బీనగర్ జోన్ కాప్రా సర్కిల్ నుంచి సికింద్రాబాద్ జోన్ బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా వెళ్లారు. ప్రస్తుతం కాప్రా సర్కిల్‌కు పూర్తిస్థాయి డిప్యూటీ కమిషనర్ లేకపోవడం గమనార్హం.

నెల్సన్ మండేలాకు నివాళి

కాప్రా: దక్షిణాఫ్రికా విప్లవ యోధుడు నెల్సన్ మండేలా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం కమలానగర్ కార్యాలయంలో నెల్సన్ మండేలా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దక్షిణాఫ్రికాలో నల్లజాతీయుల హక్కుల కోసం ప్రజాతంత్ర ఉద్యమాన్ని నడిపి 28 ఏళ్ల పాటు జైలు జీవితం అనుభవించాడని అన్నారు. కార్యక్రమంలో గొడుగు యాదగిరి, శ్రీనివాస్, కోమటి రవి, చంద్రశేఖర్, శ్రీనివాస్, కృష్ణసాగర్, వెంకటేశ్వర రావు, ప్రసాద్‌బాబు, చారి, గౌసియా, శోభ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితోనే..

సాక్షి, సిటీబ్యూరో: కరోనా నేపథ్యంలో నగర వాసుల్లో తలనొప్పి సమస్య తీవ్రమైందని అంతర్జాతీయ సంస్థ హంసా రీసెర్చ్‌తో కలిసి బేయర్స్ కన్స్యూమర్ హెల్త్ డివిజన్‌కు చెందిన సారిడాన్ చేసిన అధ్యయనంలో తేలింది. తలనొప్పి తరచూ అనుభవిస్తున్న వారిలో 93శాతం మందికి ఒత్తిడే కారణంగా ఉందని ఈ జాతీయస్థాయి అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా 22 నుంచి 45 ఏళ్ల వయసున్న మధ్య వయస్కుల్లోనే తలనొప్పి అధికమని 20 నగరాల్లో నిర్వహించిన తమ అధ్యయనం ద్వారా తేలిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ ఒత్తిడికి దారి తీస్తున్న కారణాల్లో ఆర్థిక సమస్యలు, ఉద్యోగ బాధ్యతలు, ఆరోగ్యంపై భయాలు, కుటుంబ విభేదాలు ఉన్నాయని వివరించారు.

ప్లాట్ల బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ సర్వే నెంబర్-613, 614లో కేసీఆర్ కూరగాయల మార్కెట్ పేరుతో తమ ప్లాట్లను లాక్కున్నారని తమకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన మంత్రి మల్లారెడ్డి తమకు మోసం చేశారని ఆరోపిస్తూ ప్లాట్ల బాధితుల నిరసన దీక్ష కార్యక్రమం కొనసాగుతోంది. దీక్షకు మద్దతుగా మంగళవారం కాంగ్రెస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు హాజరై మాట్లాడారు. పేద ప్రజల భూములను మంత్రి మల్లారెడ్డి లాక్కొని వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ప్లాట్ల బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్లాట్ల బాధితులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం.. సమస్యలకు తక్షణ పరిష్కారం..

వర్షంలోనూ ఉత్సాహంగా సాగిన ఎమ్మెల్యే పాదయాత్ర



కుషాయిగూడలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు



పాదయాత్రలో ఆత్మీయంగా పలుకరిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కుషాయిగూడ: సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ చేపట్టిన నమస్తే ఉప్పల్ పాదయాత్ర మంగళవారం చర్లపల్లి డివిజన్‌కు చేరుకుంది. ఉదయం కుషాయిగూడ శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఆయన పాదయాత్ర ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని కుషాయిగూడ, హనుమాన్‌నగర్, భాగ్యనగర్‌కాలనీ, వీఎన్‌రెడ్డినగర్‌తో పాటు పలు బస్తీల్లో ఆయన పాదయాత్ర చేస్తూ ప్రజలతో మమేకమయ్యారు. తన దృష్టికి వచ్చిన సమస్యకు తక్షణ పరిష్కారం చూపారు. ఓ వైపు వర్షం కురుస్తున్నా ప్రజలు పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్యే నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఆయా కాలనీల సమస్యలను తెలుసుకుంటూ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశాలిచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కుషాయిగూడలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు, బోర్‌వెల్స్ మరమ్మతులు, వేలాడుతున్న కరెంటు తీగల స్థానంలో బంచ్ కేబుల్ ఏర్పాటు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. హనుమాన్‌నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పెన్సింగ్, డ్రైనేజీ వ్యర్థాల తొలగింపు చేపట్టాలని, వీఎన్‌రెడ్డినగర్‌లో స్టామ్ వాటర్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరినట్లు ఆయన వివరించారు. పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కారం లభించేలా కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు దప్పు గిరిబాబు, అనిల్ ముదిరాజ్, అనుముల నర్సింహారెడ్డి, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, రఘుపతిరెడ్డి, బొడిగె రాజు, కడియాల బాబు, గంప కృష్ణ, వినోద్ పాల్గొన్నారు.

మహిళకు బీఎల్ఆర్ ట్రస్ట్ భరోసా



రమణమ్మను పరామర్శిస్తున్న బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన రమణమ్మ కొన్ని నెలల క్రితం చౌటుప్పల్‌లో రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయింది. గాంధీ ఆస్పత్రిలో రెండు కృత్రిమ కాళ్లు ఏర్పాటు చేశారు. కృత్రిమ కాళ్లు బరువుగా ఉండటంతో నడవలేని పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి మంగళవారం ఆమెను పరామర్శించారు. లైట్ వెయిట్ కృత్రిమ కాళ్లకు అవసరమయ్యే ఖర్చును తాను భరిస్తానని ఆమెకు బండారి లక్ష్మారెడ్డి భరోసా ఇచ్చారు. నిత్యావసర సరుకులను అందజేశారు. గతంలోనూ బీఎల్ఆర్ ట్రస్ట్ తరఫున ఆమెకు రూ.20 వేలను అందజేశారు. బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజెన్‌శేఖర్, రామకృష్ణ, అంజి, కట్ట బుచ్చన్నగౌడ్, విఠల్‌యాదవ్, గణేష్, రాజు, కర్ణ, శివ, రఫిక్, మధు తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం

మల్లాపూర్ నెహ్రూనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కొలిపాక వేణు గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. ట్రస్ట్ తరఫున ఆర్థిక సాయం అందజేశారు.

త్వరలోనే నాచారం వార్డు కార్యాలయ పనులు



అధికారులకు సూచనలు ఇస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్

మల్లాపూర్: త్వరలోనే నాచారం వార్డు కార్యాలయం నిర్మాణానికి రూ.78 లక్షలతో పనులు ప్రారంభిస్తున్నట్లు జీహెచ్ఎంసీ స్టాండింగ్ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి మంగళవారం పనులను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రసుత్తం గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌కు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నిర్మాణానికి అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించారు. లిఫ్ట్ కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ ప్రసాద్, నాచారం ఏఈ లింగారావు, వర్క్ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు ఎర్రం శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, కట్ట బుచ్చన్నగౌడ్, గాదెల్లి రామకృష్ణ, శ్రీరాం సత్యనారాయణ, శివ, శ్రీను, రఫిక్, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ



శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయం నూతన కమిటీతో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ ఎన్‌జీఆర్ఐ గేట్ వద్ద ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ నూతన ట్రస్ట్ బోర్డు మెంబర్స్ ప్రమాణ స్వీకారం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ హాజరై నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ చైర్మన్‌గా లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులుగా జంపాని బాలకృష్ణ, రాజేశ్వరి, మల్లిపెద్ది వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, సంతోష్‌కుమార్, ఎక్స్ ఆఫిషియో మెంబర్ రవీంద్రశర్మ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి భాగ్యలక్ష్మీ, చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌ముదిరాజ్, నాయకులు గరిక సుధాకర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, రవీందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి సత్యనారాయణ, జగన్, పోచయ్య, రవీందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం హబ్సిగూడలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చేతుల మీదుగా పలు దేవాలయాల కమిటీ సభ్యులకు ఆషాఢమాస బోనాల చెక్కులను పంపిణీ చేశారు. దేవాదాయ కార్యనిర్వహణాధికారి భాగ్యలక్ష్మీ, బీఆర్ఎస్ నాయకులు మేకల ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమిషాంబికా అమ్మవారికి ప్రత్యేక పూజలు



బోడుప్పల్: బోడుప్పల్ పెంటారెడ్డి కాలనీలోని నిమిషాంబికా అమ్మవారికి శ్రావణ మంగళవారం పురస్కరించుకొని అభిషేకం, అమ్మవారి అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌శర్మ తెలిపారు. ఈ నెల అమ్మవారికి ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు.

ఉప్పల్ భగాయత్‌లో భవన నిర్మాణ కార్మికుడి మృతి

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లోని వాసవి నిర్మాణ సంస్థ బహుళ అంతస్తు నిర్మాణంలో పని చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చత్తీస్‌ఘడ్ బస్తర్ జిల్లా ప్రాంతానికి చెందిన సోమేష్ కుమార్(23) 10 రోజుల క్రితం నగరానికి వచ్చి ఉప్పల్ భగాయత్‌లో వాసవి నిర్మాణ సంస్థలో కార్మికుడిగా చేరాడు. సోమవారం మరో కార్మికుడు రామేశ్వర్‌తో కలిసి పైఅంతస్తు నుంచి భవన నిర్మాణ వ్యర్థాలను తరలిస్తుండగా ప్రమాదవశాత్తు వ్యర్థాలు సోమేష్‌పై పడటంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న ఉప్పల్ పోలీసులు పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అమరవీరులకు నివాళి



సుభాష్‌నగర్ అమరవీరుల స్థూపం వద్ద మాట్లాడుతున్న అమరవీరుల కుటుంబ సభ్యులు



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తూ..

అల్వాల్: అమరవీరుల బంధు మిత్రుల సంఘం 21వ ఆవిర్భావ దినోత్సవంలో మంగళవారం సుభాష్‌నగర్‌లో గల అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్రమ కేసులు, రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సుభాష్‌నగర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. ఇటీవల విప్లవ ఉద్యమ కేంద్ర నాయకుడు కామ్రేడ్ సుదర్శన్ గుండెపోటుతో అమరుడయ్యాడన్నారు. వారి కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం విప్లవ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సత్య, భవాని, పద్మకుమారి, అంజమ్మ, కటికం సుదర్శన్ కుటుంబ సభ్యులు, అమరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశానికి సేవ చేయాలి



మేడిపల్లి: స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో నాయకత్వ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎన్‌సీసీ ఆఫీసర్ కె.భానుప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమవంతుగా దేశానికి సేవ చేయాలని, వారి తల్లిదండ్రులు, పాఠశాల, దేశానికి మంచి పేరు తేవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయభాను, డీజీఎం క్రాంతికుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



రవీంద్రభారతి స్కూల్‌లో ఆర్మీ అధికారులు

కాప్రా: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఆర్మీ సుబేదార్ అజిత్‌సింగ్, హవల్‌దార్ ప్రకాష్ ముదిలేకర్ అన్నారు. ఈసీఐఎల్‌లోని రవీంద్రభారతి స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆర్మీ అధికారులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విద్యార్థి దశనుంచే క్రమశిక్షణ చాలా ముఖ్యమని, అది ఉంటే జీవితంలో అనేక విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ డివిజన్ ఇన్‌చార్జి రాజేష్, ప్రిన్సిపాల్ లలిత, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను కలిసికట్టుగా ఎదుర్కోవాలి

అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య



సాక్షి, మేడ్చల్ జిల్లా: వర్షాకాలంలో దోమలు, ఈగలు, కీటకాలు తదితర వాటితో సంక్రమించే వ్యాధులు, నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం (డీసీసీఎం)లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. వర్షాకాలం సీజన్‌లో ప్రబలే మలేరియా, డెంగీ, ఫైలేరియా, టైఫాయిడ్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు స్థానిక అంగన్‌వాడీలు, స్వయం సహాయక బృందాల సహకారంతో పాటు జిల్లా, మండల పరిషత్‌ల సమన్వయంతో ముందస్తు రోగ నిర్ధారణ, పూర్తిస్థాయి వైద్య చికిత్స అందించడం ద్వారా ముందడుగు వేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 20 వరకు అల్బెండజోల్ మాత్రలను అందరికీ పంపిణీ చేయడం ద్వారా నులిపురుగుల నిర్మూలన లక్ష్య సాధనకు ముందుకెళ్లాని జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రీస్కూల్, పాఠశాల వయస్సు కలిగిన పిల్లల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా అల్బెండజోల్ మాత్రలను వారికి అందజేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చినుకుపడితే.. ట్రాఫిక్ చిక్కులే..



కాప్రా శ్రీరాంనగర్ నుంచి సాకేత్ టవర్ వరకు నిలిచిపోయిన వాహనాలు

కాప్రా: ట్రాఫిక్ ఇది ఓ పద్మవ్యూహం లాంటిది. హైదరాబాద్‌కు ఈ ట్రాఫిక్ పద్మవ్యూహం సర్వసాధారణం. కానీ ఇప్పుడు నగరం విస్తరిస్తున్నకొద్దీ శివారు ప్రాంతాల్లో కూడా గంటల తరబడి ట్రాఫిక్ జామ్ సమస్య ఎదురవుతోంది. ఈ ట్రాఫిక్ సమస్య కాప్రాను కూడా వెంటాడుతోంది. సాకేత్, కాప్రా, ఏఎస్‌రావునగర్, ఈసీఐఎల్, కుషాయిగూడ ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్‌లో చిక్కుకొని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల సంఖ్య పెరిగిపోవడంతో అందుకు అనుకూలంగా రోడ్ల విస్తరణ ఉండకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కాస్త వర్షం కురిసిందంటే చాలు ఈ సమస్య మరింత జఠిలమవుతోంది. వర్షాకాలం రోడ్లపై నీరు నిలవడం దానికితోడు రోడ్లకు ఇరువైపులా వ్యాపార సముదాయాల ఎదుట వాహనాలను పార్క్ చేయడం, ఇష్టానుసారంగా కొందరు రోడ్లపైనే వారి వాహనాలను నిలిపివేయడం, వ్యాపారస్తులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడంతో సమస్య ఏర్పడుతోంది. నగరంలో కురుస్తున్న వర్షాలకు మంగళవారం ట్రాఫిక్ జామ్‌తో కాప్రా–సాకేత్ మార్గంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 2 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి వాహనదారులు అవస్థలు పడ్డారు.

ముగిసిన బోనాల సంబురం



ఫలహారం బండి వద్ద నృత్యం చేస్తున్న మైనంపల్లి హన్మంత్‌రావు



రామంతాపూర్‌లో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరిలో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర ఘనంగా ముగిసింది. ఫలహారం బండ్ల ఊరేగింపు మంగళవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, శ్రవణ తదితరులు ఆయా ఆలయాల్లో పూజలు చేసి ఫలహారం బండ్లకు స్వాగతం పలికారు.

ఫలహారం బండి ఊరేగింపులో మాజీ మేయర్

కుషాయిగూడ: బోనాల పండగను పురస్కరించుకొని మీర్‌పేట్-హెచ్‌బీకాలనీలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో మాజీ మేయర్ బొంతు రాంమోహన్ పాల్గొని పూజలు చేశారు.

కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు గడ్డ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్‌లోని పలు ప్రాంతాల్లో..

రామంతాపూర్: శాంతినగర్‌లో టీఆర్ఎస్ నేత సర్వరాజు యాదవ్, నేతాజీనగర్‌లో బోసాని పవన్ ఆధ్వర్యంలో, శ్రీనివాసపురంలో బీజేపీ నేత జగన్ యాదవ్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, సీనియర్ కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



కట్ట మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న రఘునందన్‌రావు



మీర్‌పేట్-హెచ్‌బీకాలనీలో మాజీ మేయర్ బొంతు రాంమోహన్ తదితరులు



రామంతాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

మూడు పంటలకు విద్యుత్ ఇస్తున్నాం..

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి



శామీర్‌పేట్: మూడు పంటలకు విద్యుత్ సరఫరా చేసే ప్రభుత్వం తమదే అని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేట గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, యూజీడీ పనులను వెంటనే చేపట్టేల చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామంలోని ముదిరాజ్ భవనానికి రూ.10 లక్షలు, యాదవసంఘం భవనానికి రూ.3 లక్షలు తన సొంత నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంతో పాటు దేశంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దివాళా తీశాయన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులు కరెంట్ కష్టాలతో ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రస్తుతం రైతులు సుఖంగా జీవిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లుబాయి, జెడ్పీటీసీ అనిత, లాల్‌గడి మలక్‌పేట సర్పంచ్ వనజశ్రీనివాస్‌రెడ్డి, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.